# యథాశక్తి

"ఆమోరా"

"ఏవఁరా! మీలో తెల్లారగట్ట నాలుగ్గంటలకి లేచి నాతో గోదావరి గట్టుకొచ్చే మొగాడెవడైనా ఉన్నాడా?" అని హఠాత్తుగా పురిమేడు వెంకట్రావు.

శాలువాలు ముసుగెట్టి నిద్రపోవడానికి తయారౌతూన్న మా చెవుల్లో బాంబులా పడిందీ సవాలు.

'ఏం ముంచుకొచ్చిందిరా ఈ నడిశీతాకాలం అంత పెందరాళే లేచి పరుగెత్తడానికి?' అన్నాడు సుబ్బారావు.

'పనిమాట అల్లా వుంచండోయ్, ఈ పెద్దమనిషి యీ నాలుగైదు సంవత్సరాల్లో సూర్యోదయం యెప్పుడైనా చూసేడేమో కనుక్కోండోయ్' అని ఈసడించేడు ఆనందం.

ఈ గలభాలో నేనూ కలిస్తే యింక ఆ రాత్రి నిద్రకి స్వస్తిచెప్పవలసిందే అని ముసుగు గట్టిగా బిగతన్ని గుర్రు ప్రారంభించేను.

'ముయ్యండోయ్ యీ పాటికే, ఈమాత్రం చలికి ఒణికి పోతున్నారు. మహా, అందుకే తెల్లవాడింతవరకూ మనమీద రాజ్యంచేసేడు. ఈ చలి లెక్కేమిట్రా! మొన్న సిమ్లాలో పైపుల్లో నీళ్లు గడ్డకట్టుకుపోయే చలిలో ఇంటర్వ్యూ బోర్డు వాళ్ళముందు కూర్చుని గడ గడలాడించేస్తేను...' 'ఆ చలిలో గడ గడ లాడేననిరా వాడి వుద్దేశం' అన్న ఆనందం అనవసరపు వ్యాఖ్యానం వినిపించుకోనట్టు, తన వుపన్యాసం సాగించుకు పోయేడు వెంకట్రావు,—'అప్పుడైనా వాళ్ళందరికి మల్లే వులెన్ సూట్లూ, ఓవర్‌కోట్లూ, మఫ్లర్లూ బిగించేననుకుంటున్నారేమో, ఉత్తమామూలు మనగళ్ళకోటూ, యీ ఫ్లానలు ప్యాంటు తప్ప వేరేసరంజామా యేమీ లేనేలేదు. మాటలుకూడా గడ్డకట్టుకు పోయేలావున్న ఆ చలిలోకూడా జనం అంతా ముడుచుకుపోయి, తొణుకుతూనడుస్తూంటే నేనీ మామూలు డ్రెస్సుతో మాల్ మీద ఛాతీ విరుచుకుని హుషారుగా పచారు చేస్తూండడంచూసి అక్కడి జనంఅంతా దంగైపోయారంటే నమ్మండి.'

'ఆపవోయ్ నీ సొరకాయ కోతలు! ఛాతీ యెక్కడిదిరా నీకు విరవడానికి? బొజ్జ విరుచుకు నడిచేవేమో! పైగా, ఇదంతా నిజమే అయితే, అంత వుక్కపోస్తూన్న నువ్వు హడావుడిపడి 40 రూపాయలు తగలేసి యీ ఫ్లానెల్ ప్యాంటు యెందుకొన్నావో చెప్పు మరి' అన్నాడు సుబ్బారావు అడ్డసవాల్లువేసే దొంగప్లీడర్ లా మొహంపెట్టి.

'గొప్పప్రశ్నే వేసేవులే! పిప్పళ్ళబస్తాలా 200 పౌనులు బరువున్న మనవాడికి చలెయ్యలేదంటే ఆశ్చర్యం యేం వుందిరా?' అని సుబ్బారావుని కొప్పడ్డాడు ఆనందం.

'ఒరే! ఆమాటే అనద్దన్నది మిమ్మల్ని, మీ అందరికీ నా శరీరంమీదే దృష్టాయెను. ఈ అర్ధాకలి రేషనింగు రోజుల్లోకూడా శరీరాన్ని యెలాగో కష్టపడి పెంచుకొస్తూన్న నా చాకచక్యాన్నభినందించక పైగా వేళాకోళం! మీ దృష్టిదోషం యెలాగా తగిలింది యీ వారంరోజుల్లో ఒక అరపౌనైనా పెరగనేలేదు. సరే అదంతా అలా వుంచండి కాని నా మొదటి సూచన మీ అందరికీ ఆమోదమేనా? అయితే $3\frac{1}{2}$ కే అలారం పెడదాం, ఏం?'

'ఏమిట్రా గిరాకీ! సంగతేమిటో తేల్చవేం? అయినా కావలిస్తే ప్రొద్దున్నే యెనిమిదింటికిలేచి కాస్త యిడ్లెన్లూ పెసరట్లూ ఫలహారంచేసి కాఫీ తాగి బయల్దేరడానికైతే నేనూ వొస్తాను. ప్రస్తుతం మాట్లాడక పడుకుందురూ చంపక'-ముసుగులోంచే ఓమంచి సూచన ఇవతల పడేసేను.

'ఈ పిప్పళ్ళబస్తా సంగతేరా ఆలోచిస్తూంట. ఇన్నాళ్ళనుంచీ మీ రంటూంటే యేదో కాస్త పుష్టిగావుంటే ఓర్వలేక పేళ్లెడుతున్నా రనుకుంటూండేవాణ్ణి. కాని యిప్పుడు లావు తగ్గించుకోడం యెల్లాగా అని చెడ్డ తాపత్రయంగా వుందిరా. మొన్న సిమ్లా వెళ్ళేనా ఇంటర్వ్యూకి.

అక్కడ మన మోహనరావింట్లో బసచేసేను. వెళ్ళింది మొదలు వాడు ఒకటేపోరు, నీ పాత సూటు లాగి అవతల పారెయ్యరా, దాంతో ఇంటర్వ్యూకి వెళ్లేవంటే చలితో నోట మాట రాకపోవడం అటుంచి ఓ కోటైనా లేని దరిద్రుడవనీ యిదెవరిదో యెత్తుకొచ్చేవని వాళ్ళకి తట్టి తీరుతుందని. అక్కడికీ వాడికి చెప్పిచూశా, భారతదేశం బీదదేశం. అందులో కోటున్నవాళ్ళకన్న గోచీయేనా లేనివాళ్లే యెక్కువని. వాడు వింటేకదూ. వాడిపోరు పడలేక నాకోటు బదులు వాడి ఓవర్ కోటు వేసుగోవడానికీ పాంటుమట్టుకు మర్నాడు బజార్లో కొనుక్కోడానికీ రాజీపడ్డాము.

'కొంపతీసి ఆ కోటుబొత్తాలు పెట్టుకోడానికి ప్రయత్నించలేదు కద?' అన్న పానకంలో పుడకని తీసి అవతలపారేసి 'ఆమర్నాడు బజారుకి బయల్దేరేం. మోహన్‌రావే ఆ రెడిమేడ్ షాపు వాడితో హిందీలో యేదోచెప్పి, నీనడుం సైజెంత అని అడుగుతున్నాడురా అన్నాడు నాతో. వెనక ఆరేళ్ళక్రితం కాలేజీలో డాక్టరు పరీక్ష నాటికొలతలన్నీ నా డైరీలోనే వున్నాయి. అందులోచూసి పొడుగు 4, నడుం 34 అన్నాను. అదివిన్న ఆషాపువాడి మొహంచూస్తే, క్రాస్‌వర్డు పజిల్లో మొదటి బహుమానం తనకే ఒచ్చిందన్న వార్తవిన్నప్పటి మన పక్కింటాయన ముఖం, జ్ఞాపకంవొచ్చింది. వాడి ముఖభంగిమ చూస్తూంటే యిందులో యేదోవుందని తట్టింది గాని అదేమిటోమాత్రం తెలియరాలేదు. వాడు తెచ్చిన 34 సైజుది తొడుక్కూచూద్దును గదా అది సత్యాగ్రహం చేసి వూరుకుంది. అయినా తొడుక్కోడంలో లోపమేమోనని వూపిరిబిగపట్టి గట్టిగా లాగేటప్పటికి రెండు బొత్తాలూడిపోయి, వెనకాల కుట్లు తెగిపోయిన చప్పుడైంది. ఇంక లాభంలేదని అది వాడికిచ్చేసి యింతకన్నా పెద్దసైజుది, యే ముప్పైఆరుదో తెమ్మన్నాను. వాడు వినిపించుగోనట్టు ఓ టేపు తెచ్చి కొలత తీసుకుని '44- నేమొదటే అనుకున్నా'నని సణుక్కుంటూ లోపలికి పోయేడు, వాడికి బుద్ధిఒచ్చేలా చుర్రుమనే మాట అంటిద్దామనుకున్నాను గాని బాగుండదని వూరుకున్నాను. అదీకాక, అటువంటిమాటా యేదీ జ్ఞాపకం వొచ్చిందికాదు సమయానికి!

ఈమాటు వాడు తెచ్చిన 44 సైజుది తొడుక్కుని చూస్తే దిద్దినట్టు సరిపోయింది. ఇంతబొజ్జ యెప్పణ్ణించి పెంచేనా అన్న సమస్య లోపల వేధిస్తూన్నా పైకి కనపడనీయకుండా, వాడికి 40 రూ॥ చెల్లించి బయటపడ్డాం. చెపితే నమ్మరుకాని, అప్పటినుంచీ యీ ఆలోచనతోటే కృశించిపోతున్నానంటే యేమీ అతిశయోక్తిలేదురా. ఆ రోజునుంచీ యెవడు కాస్త నావేపుచూసినా, వాడిదృష్టి నాపొట్టమీదేనని తగని అనుమానం నాకు. అన్నింటికన్నా మొన్న రైల్లో జరిగిన సంగతే తలతీసేసినట్టుందిరా. ఇంటరుక్లాసు పెట్టెలో యెక్కి మామూలుగా బాసినపట్టేసుక్కూచున్నాను. జనం చోటులేక చస్తున్నారు తోక్కుగుని. ఆయనెవరో తెలుగాయన పెళ్లామూ నలుగురు పిల్లలతో బండెడుసామానేసుగుని యెక్కేడు. కూర్చోడానికి చోటు వెతుకుతూ, నా మొహం చూసి తెలుగు వాణ్ణని గ్రహించేడోయేమో, 'కొంచెం కాళ్లుక్రిందబెట్టి సర్దుకు కూచోండిబాబూ,' అన్నాడు మర్యాదగానే. నన్ను కానట్టు, ఆయన చెప్పిన దేమిటో తెలియనట్టు కొశ్చన్‌మార్కు మొహంపెట్టి, ఆయన మీదుగా వెనకాల వాళ్ళ వైపుచూస్తూ నిశ్చలంగా కూర్చున్నాను. మన పాచికపారింది. ఆయన నన్నేమీ అనలేక పెళ్ళాంతో ఫిర్యాదుచేసేడు. 'చూడవే ఈ అయ్యరు! (బహుశా మన మిట్టపళ్ళుచూసి అల్లా అనుకుని వుంటాడు.) రాయిలా పలక్కుండా కూచున్నాడు బానలా బొజ్జా పీడూను. అసలు యిటువంటి వాళ్ళదగ్గర న్యాయంగా మూడు టిక్కట్లు వసూలుచేయాలి.' ఆ పక్కనే యింకో తెలుగాయన కళ్ళజోడూ వాడూ, అందుకున్నాడు' 'ఈ ప్రభుత్వమే బొజ్జ వాళ్ళదైతే మనమేం చెయ్యగలమండీ! అసలైన సోషలిస్టు ప్రభుత్వమైతే వీళ్ళందరిచేతా బొజ్జలు కరిగించేలా పనిచేయించదూ. ఆ రోజులూ అట్టే దూరం లేవు లెండి.' ఈ రకంగా నడిచింది సంభాషణ.వాళ్ళను కొనేది నాకు తెలియదనుకున్నారు గనక సరిపోయిందిగాని లేకపోతే వాళ్ళందర్లో యెంత అవమానం. అయినా కుళ్ళుతూనేవున్నాను లోపల. ఈ లావు తగ్గించేందుకు వుపాయాలు ఆలోచించి ఆలోచించి బుర్రవేడెక్కిపోయింది. చివరికి నిశ్చయించేను. ఎంతకష్టమైనా సరే, రోజూ తెల్లార

గట్టలేచి గోదావరి గట్టున ఒక అరగంటసేపు చెమటలు పట్టేలా పరిగెత్తడం కన్న మార్గాంతరం లేదని, కాని అంతపొద్దున్నే లేవడం యేనాడో మరిచిపోయేను. అందుచేతే మీ అందరి సహాయ సహకారాలూ అర్థిస్తూన్నది.' అని ముగించేడు.

అంతా సరే నన్నాము. తెల్లారగట్టే వాడు కుయ్యో మొర్రోమని బిగుసుకుపోతూన్నా కనికరించక చెరో జబ్బా పుచ్చుకు లేచి కూర్చోబెట్టేము. వాడు కళ్లు మూసుకునే, రాత్రి తనకో పాడు కల ఒచ్చిందనీ మనస్సంతా యెల్లాగో వుందనీ అంచేత ప్రారంభోత్సవం మరునాటికి వాయిదావేస్తే బాగుంటుందనీ మూలిగేడు. మాకేం పోయింది, సరే నన్నాము.

మర్నాడు రాత్రి కొంచెం చినుకులుపడ్డాయి. ఆ బాడి బండలో పరిగెత్తితే జారిపడి కాలు విరగడం, అధమంగట్టిగా బెణకడం, తప్పదనీ, దాంతో అసలు కార్యక్రమం అంతా అడ్డిపోతుంది కనక ఆ నాటికి వొద్దన్నాడు వెంకట్రావే. ఆ మర్నాడు రాత్రి రెండో ఆట సినిమా కెళ్లాం. ఆ తెల్లారగట్ట రెండు గడియారాలూ జాయింటుగా అలారం కొడుతూంటే మా పేటలో వాళ్ళందరికీ మెలకువొచ్చింది కాని, మాలో ఒక్కడికీ మెలకువే రాలేదు. నాలుగో రోజున యింక వాడి సంగతి శ్రద్ధవహించకపోతే లాభంలేదని, రాత్రి పడుకునే ముందు వాణ్ణి నిలదీసి, ఆ తెల్లారగట్ట వెళ్ళితీరాలని గట్టిగా సలహా యిచ్చేము.

ఏదో మహాతీవ్రమైన నిశ్చయాన్ని ప్రపంచకానికి ప్రకటనచేస్తూన్నట్టు, ' మీ కందరికీ యెందుకురా శ్రమ. గోదావరి గట్టు స్కీము కాన్సిల్ చేసేసేనురా. ' అన్నాడు.

' ఈప్రజ్ఞ కేనట్రా మమ్మల్ని మూడు రోజులూ సుఖంగా నిద్రపోనీయకుండా చంపుకు తిన్నది ? మా బుద్ధి గడ్డితినిగాని లేకపోతే నీబోటి కుంభకర్ణుడు తెల్లారగట్టే నిద్రలేవడమేమిటి? ఒకవేళ యే యేనుగులచేతో త్రొక్కించివేసినా, నీ బొజ్జా నువ్వూ పరుగెత్తడ మేమిటి ? ' అని అందరం ఏకగ్రీవంగా లెంప లేసుకున్నాము.

' అంతకోపమైతే యెల్లాగరా ? నే చెప్పేది కూడా కాస్త వినండి. నిన్న పార్కులో మీటింగులో ఆయనెవరో పెద్ద కాంగ్రెసు నాయకుడిచ్చిన వుపన్యాసం విన్నారు కదూ ? అది విన్నప్పటినుంచీ నా మనస్సు తిరిగిపోయింది. ఆయన చెప్పిన మాట లింకా నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే వున్నాయి. 'స్వాతంత్ర్యం వొచ్చేక దేశాన్ని అనేక ఘోర సమస్య లెదుర్కొన్నాయి. అవన్నీ పరిష్కారం చెయ్యడానికి మేం అంతా కృషి చేస్తూంటే, ప్రభుత్వపు సాధక బాధకాలు తెలియని మూర్ఖప్రజ మాకు ముందు తిండి కావాలి, కట్టుకునేందుకు బట్టగావాలి, బ్లాకు మార్కెట్టు నశించాలి—మొదలైన అప్రస్తుత నినాదాలతో అలజడి చేస్తున్నారు. ఈనాడు దేశంలో బ్లాకు మార్కెటు ప్రబలంగా వుందంటే తప్పెవరిది? ఇంకో నాలుగుడబ్బులు లాభం తీద్దామనుకునే షాహుకారుదా? కాదు. అది బ్లాకుమార్కెట్టని తెలిసికూడా అక్కడే సరుకులు కొంటూన్న ప్రజలదే తప్పు. మీరే కనక బ్లాక్ మార్కెట్ పోవాలని కోరేట్టయితే ఈ రోజునుండే అక్కడ కొనడం మానేయండి. పైన బియ్యం దొరక్కపోతే వుపవాసమేనా వుంటాంగాని బ్లాకులో మాత్రం కొనమని మీరంతా ప్రతిజ్ఞ తీసుగోవాలి. బట్టల విషయంలోనూ అంతే. ప్రజాసామాన్యం యీకొద్ది సహకారాన్ని మాకూ, మా ప్రభుత్వాలకూ యిచ్చినట్టయితే యీ బ్లాకుమార్కెటును రూపుమాపి తీరుతామని హామీ యిస్తున్నాను' అని ఆయనబల్ల (అనుకుని ముందు కూచున్న ప్రెసిడెంటుగారి బట్టతలమీద) గుద్ది చెపుతూంటే నాకు జ్ఞానోదయమైనట్టయింది. ఆక్షణంలోనే నిశ్చయించుకున్నాను ఈ విషయంలో నా డ్యూటీ నేను చెయ్యాలని. ఈబొజ్జ తగ్గిందంటే కొత్తపాంటు కుట్టించాల్సిందే, యీ 40 రూ॥లదీ తీసి అవతలపారేసి. మరి కొత్తది కొండం అంటే బ్లాకుమార్కెట్టులోనే గదా ? అంటే—రెండునేరాలు చేసినవాణ్ణవుతానా మరి ? దేశసౌభాగ్యంకోసం అవసరమైతే యింతకిరెట్టింపు బొజ్జతో వూరేగడానికి తయారుగా వున్నాను. ఆమాత్రం త్యాగంచేయలేనినాడు మనం స్వతంత్రభారతపౌరు లనిపించుకోడానిక్కూడా అనర్హుల మౌతాము. వెంటనే అలారంముల్లు 9 మీదకి పెట్టండి. మాట్లాడక పడుకోండి' అని దబాయిస్తూంటే మా వెంకట్రావులో ఆ కాంగ్రెసు నాయకుని చిహ్నాలు చాలవరకూ కనిపించేయి.